వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల


అన్నదానం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఆంజనేయస్వామి వారికి రుద్రాభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు ప్రత్యేక క్యూలైనులు ఏర్పాటు చేసి దర్శనం కలిగించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, దద్దోజనం, పొంగళ్లు, పానకం, వడపప్పు వంటి ఆహార పదార్థాలు తయారు చేసి భక్తులకు అందజేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో పార్టీలకతీతంగా రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వారిని పూర్ణ కుంభంతో ఆహ్వానంచి ఆశీర్వచనం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలు ప్రారంభించారు.

దూడల పెంపకంలో మెళకువలు పాటించాలి


నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న అధికారులు

దర్శి: మేలుజాతి దూడల పెంపకంలో సరైన మెళకువలు పాటించి వాటిని కాపాడుకోవాలని జిల్లా ఈఓడీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాలెంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి లేత దూడలే రేపటి పాడి పశువులని పేర్కొన్నారు. పశుపోషకులు నత్తల నివారణ గురించి తగు జాగ్రత్తలు పాటించాలని ఒంగోలు డీడీ డాక్టర్ రమేష్ తెలిపారు. పశు సంవర్ధక శాఖ అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. దర్శి ఏడీ డాక్టర్ పురుషోత్తమరాజు, బొట్లపాలెం వీఏఎస్ డాక్టర్ బసవయ్య, పాపిరెడ్డిపాలెం సర్పంచ్ ముచ్చుమారి వెంకటరెడ్డి, దర్శి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన యువకులు


దొంగతనం చేస్తూ పట్టుబడిన యువకుడు

కురిచేడు: పట్టపగలే కొలిమిలో ఇనుప సామాను దొంగతనం చేస్తున్న వ్యక్తిని యువకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంగళవారం స్థానిక దర్శి రోడ్డులోని బ్రహ్మంగారి గుడి పక్కన ఉన్న కొలిమిలో ఇనుప సామానులు దొంగతనం చేస్తుండగా యువకులు పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, ఇనుప సామానులు మొత్తం పోలీసులకు అప్పగించారు.

సమీకృత దాణాను రైతులు ఉపయోగించుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీడీ డాక్టర్ రమేష్

తాళ్లూరు: పశుసంవర్ధక శాఖ పాడి రైతులకు అందిస్తున్న సమీకృత దాణాను ఉపయోగించుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ సూచించారు. తాళ్లూరు పశువైద్యశాల, శివరామపురం ఆర్‌బీకేలను మంగళవారం ఆయన పరిశీలించారు. శాఖ పరంగా అమలవుతున్న పలు కార్యక్రమాల గురించి సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. జిల్లా ఈఓ డీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా, పశువైద్యాధికారి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ


రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సుబ్బారెడ్డి

మార్కాపురం: ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యశాలలో 30 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ పర్యవేక్షకుడు డాక్టర్ ఎం.రాంబాబు, యూనిట్ సభ్యులు, దాతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

తాళ్లూరు: రబీలో సాగు చేసిన ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు ఆర్‌బీకేలో మంగళవారం ఈ-క్రాప్ నమోదైన పంటల వివరాలు అందుబాటులో ఉంచారు. రబీ కాలంలో మండలంలో 27 రకాల పంటలు 2,884 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. రైతులు తాము సాగు చేసిన పంటలు వివరాలు పరిశీలించికుని తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వీఏఏ నాయక్ పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న నరసింహులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోదారుల హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు ఓసీహెచ్ నరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. వస్తువు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకుంటే వస్తువు నాణ్యతలో తేడా వస్తే నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, రక్షణ చట్టం, పరిహారం పొందడంపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు, హెచ్‌ఎం కనకదుర్గ, వినియోదారుల హక్కుల పరిరక్షణ సంఘ నాయకులు ఎస్‌ఎల్ నరసింహారావు, ఎస్‌ఏ జలీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జంగిటి శ్రీనివాసులు (55) మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు.. శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రమశిక్షణ నేర్పించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

కొనకనమిట్ల: తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సురేఖ అన్నారు. మంగళవారం గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా అన్నీ వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయుల పనితీరు ఉండాలన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ సురేఖ స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన ఉత్పత్తులు


పూరిమెట్లలో మిరప పంటను పరిశీలిస్తున్న డీపీఎం సుభాషిణి

ముండ్లమూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పలు నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి తెలిపారు. మండలంలోని పూరిమెట్లలో మంగళవారం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు సాగు చేసిన మిరప పంటను ఆమె పరిశీలించారు. పంట ప్రారంభం నుంచి దిగుబడి పూర్తయ్యే వరకు అవలంబించిన పద్ధతులను తోటి రైతులకు ఆయన వివరించారు. ప్రతి రైతు తనకు గల పొలంలో కొంత పొలాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసి దాని ఫలితాలను తెలుసుకోవాలని డీపీఎం సూచించారు. తద్వారా పండించిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రభాకర్, కళ్యాణి, మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి

● మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్

మార్కాపురం టౌన్: నేర వార్తలు రాసే ముందు జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ డాక్టర్ కిశోర్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల ప్రాంతీయ సమావేశం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పాత్రికేయులు, పోలీసులు సమన్వయంతో పని చేసి సమాజానికి మెరుగైన సేవలందించాలని కోరారు. వార్తలు సేకరించే సమయంలో సంఘటనకు సంబంధించి వివరాలు నిర్ధారించుకొని రాస్తే కచ్చిత సమాచారాన్ని ప్రజలకు పాత్రికేయులు అందించినట్లవుతుందన్నారు. తొలుత వైఎస్సార్ సీపీ యువ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కుందూరు కృష్ణమోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, యూనియన్ జిల్లా కార్యదర్శి కనకయ్య, బీజేయూ సభ్యుడు ఎస్‌వీ రమణ, మాజీ జిల్లా అధ్యక్షుడు నూరుద్దీన్, వై.పాలెం నాయకులు మూర్తి, చిన్న పత్రికల సంఘ జిల్లా అధ్యక్షుడు హనీఫ్, మూడు నియోజకవర్గాల్లోని ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులను బొకేలు, శాలువలతో విలేకరులు సన్మానించారు.

క్లుప్తంగా

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


తోకపల్లెలో నూతనంగా ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం

పెద్దారవీడు: మండలంలో తోకపల్లె గ్రామంలో లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ, విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం సాయంత్రం అర్చకులు పెరుగువల్లి సబ్రమణ్యంశర్మ, పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. శుక్రవారం ఉదయం 8.17 గంటలకు యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ, ఆలయ విమాన శిఖర ప్రతిష్ఠ, స్వామి ప్రథమ దర్శనం, దృష్టి కుంభం పూజలు తదనంతరం సీతారామచంద్రస్వామి శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు వివరించారు. అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా

గిద్దలూరు రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం పరిధిలో మృతి చెందిన బలుసా వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా మట్టి ఖర్చుల కింద పది వేల రుపాయలు మంగళవారం అందజేసారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెనగమూరు వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన గొట్టం వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు వెంకట్రావు, మనవడు గణేష్, మనుమరాలు లక్ష్మిలతో కలిసి తన ద్విచక్రవాహనంపై బంధువుల పిలుపు మేరకు దర్శి తిరునాళ్లకు వెళ్తున్నారు. మండలంలోని పెనగూమరు వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంకట్రావు తలకు గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు కాలు విరిగింది. అదృష్టవశాత్తు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

యర్రగొండపాలెం: ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల వద్ద బుధవారం నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై జి.కోటయ్య తెలిపారు. మార్కాపురం రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మాచర్ల రోడ్డులోని గురుకుల కళాశాల, గౌతమి, సాధన కళాశాలల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మంగళవారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొమరోలు: మండల కేంద్రం కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి 29వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్నట్లు ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 265 మంది పరీక్షలు రాయనుండగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 306 మంది పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, రాజుపాలెం కేజీబీవీ పాఠశాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు. పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ వాచ్‌లు తీసుకురావద్దని సూచించారు.

త్రిపురాంతకం: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జూనియర్ కళాశాల కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 445 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ రామలక్ష్మి తెలిపారు. త్రిపురాంతకంలో కేజీబీవీ, దూపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాల, వైష్ణవి కళాశాల కేంద్రాల్లోనూ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

యువకుల ఘర్షణ..కత్తితో దాడి

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్లో ఉన్న ఒక బార్ అండ్ రెస్టారెంట్లో ముగ్గురు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు కలిసి ఒకడిని కత్తితో పొడిచారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. పట్టణంలోని ఎన్‌ఎస్ నగర్లో నివాసం ఉండే నాగరాజు పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన మరో ఇద్దరు కలిసి బార్ అండ్ రెస్టారెంట్లో మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో వారి మధ్య ఒక విషయంపై వాగ్వాదం జరిగింది. దీంతో సుంకేసుల గ్రామానికి చెందిన ఆ యువకులు నాగరాజుపై కత్తితో దాడి చేయడంతో స్థానికులు గుర్తించి చికిత్స కోసం జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ


ముండ్లమూరు: బాలికతో డీవార్మింగ్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్లు జ్యోతి, జాస్మిన్

దొనకొండ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాధికారి సునీత ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. 13,486 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, హెచ్‌ఎం రామాంజనేయులు, హెచ్‌ఈఓ కె.చంద్రశేఖరబాబు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని 45 కేంద్రాల పరిధిలోని చిన్నారులకు వైద్య సిబ్బందితో కలిసి మాత్రలు పంపిణీ చేశారు.

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 4001 మందికి నులిపురుగుల నివారణా మాత్రలు అందజేసినట్లు ముండ్లమూరు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. ప్రాథమిక కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో 4431 మందికి మాత్రలు వేయాల్సి ఉండగా 4001 మందికి వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి పృథ్వీరాజ్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు 12,311 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైపాలెం పట్టణంలో మాత్రల పంపిణీ కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ఎంపీడీఓ ఎం.రామసుబ్బరాయుడు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ కోటనాయక్, ఎంఈఓ పి.ఆంజనేయులు, మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండలం ముటుకులలో వైద్యాధికారి రవినాయక్ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. ముటుకుల పీహెచ్‌సీ పరిధిలో 4963 మంది విద్యార్థులు ఉండగా 97 శాతం మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

త్రిపురాంతకం: స్థానిక బ్రహ్మంగారి కాలనీ స్కూల్లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం .పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మరియదాస్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని 412-అంగన్‌వాడీ కేంద్రంలో చింతల పీహెచ్‌సీ వైద్యురాలు సాయి ప్రశాంతి ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఓ మంత్రునాయక్, సూపర్‌వైజర్ పద్మావతి, మల్లేశ్వరిదేవి, ఏఎన్‌ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఎంఈఓ మస్తాన్‌నాయక్ తదితరులు మాత్రలు అందజేశారు.

హనుమంత వాహనంపై శ్రీవారి ఉత్సవం


ముస్తాబైన ఉత్సవ మూర్తి

కొనకనమిట్ల: శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ వెలుగొండ క్షేత్రం భక్తుల జయజయ ధ్వానాలతో పరవశించిపోతోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి రోజుకొక అవతారంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీవారు పల్లకిలో అలంకరించిన హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవ ఉభయదాతులుగా తాడి తిరుపతిరెడ్డి, చినసుబ్బారెడ్డి, గాలిరెడ్డి, కొండారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమార్‌శర్మ, సింహాద్రిచార్యులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం గరుడోత్సవ ఉత్సవం, ఎడ్లపందేలు జరుగుతాయని ఆలయ మేనేజరు చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

వెలుగొండలో 15, 16 తేదీలలో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లను పురష్కరించుకొని తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు పటిష్టంగా అమలు చేస్తామని ఎస్ఐ కడలి దీపిక అన్నారు. మంగళవారం ఆమె ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డితో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. వెలుగొండస్వామి ఆలయం, కొండపై ఉన్న పీఠమీదలక్షమ్మ ఆలయం, గంగాభవాని ఆలయాలను పరిశీలించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై చైర్మన్ తిరుపతిరెడ్డితో చర్చించారు. అన్నదాన సత్రాల నిర్వహణ, తిరునాళ్లలో షాపులు నిర్వహణ, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి ఎస్ఐ మాట్లాడారు. విద్యుత్ ప్రభల ఏర్పాటు, ఎడ్ల పోటీలు నిర్వహించే ప్రాంతాన్ని, రథం తిరిగే చోట పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. రెండు రోజులపాటు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ సుధాకరరావు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ దీపిక అన్నారు.

వెలుగొండ తిరునాళ్ల రేపు


శ్రీవారి మూలవిరాట్

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం కొనకనమిట్ల మండలం వెలుగొండలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి మొదలు బహుళ ఏకాదశి వరకు బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. నేడు బుధవారం గరుడోత్సవం, గురువారం గజోత్సవం తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. శుక్రవారం రథోత్సవం జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్ల సందర్భంగా అన్నీ కులాలకు సంబంధించిన అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేయనున్నారు. తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచే కాక, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో బ్రహ్మోత్సవాలకు వచ్చి దేవుని దర్శనం చేసుకుంటారు.


తాడి వారి మర్యాద

తాడివారి మర్యాద అంటే రాచ మర్యాద కాదు..అప్పట్లో శ్రీవారు చెంచులక్ష్మిని వివాహం చేసుకున్నప్పుడు లక్ష్మీదేవి బంధువులు అయిన తాడివారిపల్లి వాసులు కత్తులు, కటార్లతో స్వామివారిపై దాడి చేశారని పురాణాల్లో ఉంది. ఇదే తాడివారి మర్యాద అంటే. ఈ సంప్రదాయం ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో కొనసాగుతోంది. తాడివారిపల్లి వాసులు ఆయుధాలతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కత్తులు, కటార్లతో ఉత్సవం చేయటం ఆనవాయితీ.

దేవస్థానానికి వెళ్లే రూటు

పొదిలి నుంచి మార్కాపురం వెళ్లే దారిలో నాగిరెడ్డిపల్లి స్టేజి నుంచి నాలుగు కిలోమీటర్లు దక్షిణం వైపుగా ప్రయాణిస్తే పుణ్యక్షేత్రం వస్తుంది. అలాగే పొదిలి-గిద్దలూరు రహదారి గొట్లగట్టు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో వెలుగొండ చేరుకోవచ్చు. మూడు రోజులపాటు పొదిలి, మార్కాపురం, కనిగిరి డిపోల వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి అన్నదమ్ములకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన దానమయ్య

అర్ధవీడు(కంభం): బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యాచవరానికి చెందిన సోదరులు దానమయ్య(ఆర్మీ జవాన్), బాలకాశయ్య బైక్‌పై కంభం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మాగుటూరు సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయారు. దానమయ్య తలకు తీవ్రగాయాలు కాగా, బాలకాశయ్యకు కాలు విరిగింది. క్షతగాత్రులను కంభం ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తీసుకెళ్లారు.